జగన్ పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి

'గడప గడపకూ మన ప్రభుత్వం'లో
విప్ కాపు రామచంద్రారెడ్డి


యర్రగుంటలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

కణేకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ఒక్కో ఇంటికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ లబ్ధి చేకూరడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. మండలంలోని యర్రగుంట గ్రామంలో శనివారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు కెనిగుంట రామిరెడ్డి, అశోక్‌తో కలిసి కాపు గ్రామంలో విస్తృతంగా పర్యటించి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. విప్ మాట్లాడుతూ రూ.కోట్లు దోచుకొన్న చంద్రబాబు, అతని అనుచరులకు ధన దాహం తీరలేదన్నారు. మళ్లీ మీ వద్దకొచ్చి మాయమాటలు చెబుతారని, ఎట్టి పరిస్థితుల్లో వారి మాటలను నమ్మొద్దన్నారు. 2014 ఎన్నికల్లో 610 హామీలిచ్చి చంద్రబాబు అందులో ఏ ఒక్కటి సక్రమంగా నెరవేర్చలేదన్నారు. స్కిల్ డెవలప్‌మెంటు స్కామ్‌లో చంద్రబాబు రూ.371 కోట్లు దోపిడీ చేస్తే రాయదుర్గం ప్రాంతంలో ఇసుక, మట్టి దందాలో అప్పటి మంత్రి కాలవ శ్రీనివాసులు రూ.500 కోట్లకు పైగా దోచేశారన్నారు. ఇసుక దందా గురించి టీడీపీ మానసికపుత్రికైన టీడీపీలోనే పెద్దపెద్ద అక్షరాలతో వార్తలొచ్చాయన్నారు. వివిధ కుంభకోణాల్లో చంద్రబాబు రూ.కోట్లు కొల్లగొట్టాడని, ఇక ఆయన భవిష్యత్తు జైలేనన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్య, ఎంపీడీఓ శ్రీనివాసులు, కణేకల్లు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ హనుమంతరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, వైఎస్సార్ సీపీ నాయకులు పాటిల్ రామచంద్రారెడ్డి, భీమప్ప, గొల్ల భీమిరెడ్డి, గొని శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి, సోంశేఖర్‌రెడ్డి, కేజీ ఈరన్న, గోవర్ధన్‌రెడ్డి, కె.అశోక్, అనిల్‌కుమార్, పెద్ద హనుమంతరాయుడు, చిన్న హనుమంతరాయుడు, ప్రకాష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల నెరవేరిన వేళ

కళ్యాణదుర్గం: సీఎం జగనన్న ఆశీస్సులతో దశాబ్దాల కళ నెరవేరింది. శెట్టూరు మండలం అయ్యగార్లపల్లిలో నిరుపేదల భూ సమస్యను పరిష్కరించి వారికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశామని రాష్ట్ర మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ శెట్టూరు మండలంలోని అయ్యగార్లపల్లిలో సుమారు 35 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న నిరుపేదల భూ సమస్యను పరిష్కరించామని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో సుమారు 30 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులందరూ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగనన్న పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి శాశ్వత నివాసం కల్పించారని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణి కుమార్, జెడ్పీటీసీ మంజునాథ్, నాయకులు హరినాథ్ రెడ్డి, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.


పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సత్కారం


అవార్డు గ్రహీత హెచ్‌ఎం రమణ ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కూడేరు: మండలంలోని పి.నారాయణపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణ ప్రసాద్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం మండలానికే గర్వకారణమని ఎంఈఓలు చంద్రశేఖర్, సాయికృష్ణ అన్నారు. శనివారం మండల విద్యాశాఖ తరఫున స్థానిక ఎమ్మార్సీలో అవార్డు గ్రహీతను ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ అంకిత భావంతో విధులను నిర్వర్తిస్తే గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం రమణప్రసాద్, నిర్మల దంపతులను శాలువాలు , పూలమాలలతో సన్మానించారు. మండలంలోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రస్తా ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి


ఆర్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఎస్సీ కాలనీకి వెళ్లే రస్తాకు అడ్డంగా బండలు పాతిన వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు శనివారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. కాలనీ వాసులు మాట్లాడుతూ హరిజన రుద్రప్ప, హరిజన రామన్న, హరిజన తిప్పేస్వామి కలసి 20 ఇళ్లకు వెళ్లే రస్తాను ఆక్రమించి..అడ్డంగా నల్లబండలు పాతారని వాపోయారు. అధికారులు స్పందించి వెంటనే రస్తాను అడ్డుగా ఏర్పాటు చేసిన నల్లబండలను తొలగించాలని వారు కోరారు. అనంతరం ఆర్‌ఐ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

చిరుత దాడిలో దూడ మృతి

కూడేరు: చిరుత దాడిలో ఆవు దూడ మృతి చెందింది. వివరాలు.. కూడేరుకు చెందిన రైతు సంగప్పనాయుడు తన పొలంలో పాడి పెంపకం చేపట్టారు. శుక్రవారం రాత్రి రైతు పొలంలోకి చొరబడిన ఓ చిరుత ఏడాది వయసున్న ఆవు దూడను లాక్కెళ్లి సగానికి పైగా తినేసింది. శనివారం ఉదయం ఇంటి నుంచి పొలానికి చేరుకున్న రైతు.. దూడ కనిపించకపోవడంతో జాడ కోసం వెతకారు. అక్కడికి కాస్త దూరంలో దూడ కళేబరాన్ని గుర్తించి, చిరుత దాడిలో మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ బీట్ ఆఫీసర్ నీలవేణి, పశువైద్యాధికారి రాఘవ తదితరులు అక్కడకు చేరుకుని దూడ కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు.

నిత్యావసరాల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కుందుర్పి: మండల కేంద్రంలో శనివారం ఐఎఫ్‌సీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 25 మంది మహిళ సంఘ సభ్యులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఆ సంఘం రాష్ట్ర డైరెక్టర్ శ్యామ్ మాట్లాడుతూ తమ సంఘం మహిళాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు రాజగోపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లింగప్ప, బ్యాంక్ నాగరాజు, నారాయణస్వామి, సర్పంచ్ రామ్మూర్తి, డివిజనల్ మేనేజర్ చౌడప్ప, సిబ్బంది కొల్లయ్య, అశోక్, మండల ఎగ్జిక్యూటివ్ డీలర్ జంబుగుంపల తిప్పేస్వామి పాల్గొన్నారు.

హెచ్చెల్సీ పరిశీలన


మాట్లాడుతున్న అధికారులు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుంచి వచ్చే హెచ్చెల్సీని ఆంధ్ర సరిహద్దులోని 105 కిలోమీటర్ వద్ద ఎస్ఈ రాజశేఖర్ శనివారం పరిశీలించారు. సరిహద్దులో 1750 క్యూసెక్కులు నీరు చేరుతున్నాయని ఇప్పటి వరకు 5.5 టీఎంసీలు నీటిని తీసుకున్నామన్నారు. జల చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, మోటర్ల ద్వారా నాన్ ఆయకట్టుకు నీటిని వాడుకునేవారితో అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తుంగభద్ర జలాశయంలోకి ఇన్‌ఫ్లో రావడం లేదని ప్రస్తుతం నీటి నిలువ 65 టీఎంసీలు ఉన్నాయని ఈ సారి పంటలకు సాగునీరు అందడం ఇబ్బందిగా ఉంటుదని ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో నీటిని వినియోగించుకునేందుకు రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కణేకల్లు హెచ్చెల్సీ డీఈ మద్దిలేటి, జేఈ అల్తాఫ్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు సమష్టి కృషి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి

కణేకల్లు: బాల్య వివాహాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం బాల్య వివాహాల నియంత్రణపై వర్క్‌షాపు నిర్వహించారు. ఐదు మండలాల నుంచి తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్ఐ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హాజరయ్యారు. పీడీ మాట్లాడుతూ చిన్న వయస్సులో బాలికలకు పెళ్లి చేస్తే అనేక అనర్థాలకు దారితీస్తుందన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిల్లల చదువు కోసం అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీవిద్య లాంటి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అమ్మాయిలు కష్టపడి చదివి మహిళా సాధికారిత సాధించాలనేదే సీఎం ఆశయమన్నారు. జిల్లా బాలల పరిరక్షణ సమితి సుబ్రమణ్యం మాట్లాడుతూ బాల్య వివాహాల నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చట్టాలను తీసుకొచ్చిందన్నారు. మైనర్లకు పెళ్లి చేస్తే వారు కూడా శిక్షార్హులేనన్నారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి పిల్లలు మత్తుపదార్థాలకు బానిసైతే జరిగే అనర్థాలతోపాటు సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కణేకల్లు, బొమ్మనహాళ్, రాయదుర్గం తహసీల్దార్లు రజాక్‌వలి, శ్రీనివాసులు, మారుతి, ఎంపీడీఓలు శ్రీనివాసులు, భాస్కర్‌బాబు, షకీలాబేగం, ఈఓఆర్‌డీ గూడెన్న, కణేకల్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్, బాలల పరిరక్షణ సమితి కౌన్సిలర్ సంధ్య, సిబ్బంది సమీర్ కుమార్, వసంతలక్ష్మి, మహిళా పోలీసులు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను పరిష్కరించండి


మంత్రి బుగ్గనతో చర్చిస్తున్న విప్ కాపు

రాయదుర్గం: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నెలాఖరులోగా పరిష్కరించాలంటూ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల ఏర్పాట్లపై మంత్రి ప్రభుత్వ చీఫ్ విప్, విప్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విప్ కాపు మంత్రితో పలు విషయాలు చర్చించారు. ఈ అంశాన్ని విప్ కాపు 'సాక్షి'కి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకారం మేరకు .. అర్బన్‌తో పాటు పలు మండలాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై నివేదికలు సిద్ధం చేసి సీఎంఓ కార్యాలయంలో సమర్పించామన్నారు. వాటికి తగిన నిధులు సమకూర్చేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు విప్ వివరించారు. అలాగే ఈ నెల 21 నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించే అసెంబ్లీ సమావేశాల్లో భద్రత, వసతులు తదితర అంశాలపై చర్చించామన్నారు.

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

బొమ్మనహాళ్: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఉత్సవాలు నిర్వహించే వారు విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ శివ సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. వినాయక నిమజ్జనం రోజు విగ్రహాలను తరలించే మార్గం, నిమజ్జన ప్రదేశం ముందుగా పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. కమిటీ సభ్యులు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలన్నారు. విగ్రహాలకు విద్యుత్ సరఫరా విషయంలో జాగ్రత్తలు, విద్యుత్ శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా , అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను జరుపుకోవాల్సిందిగా ఎస్ఐ కోరారు.

తక్షణ సాయం పంపిణీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 22వ వార్డు కోట వాకిలి వద్ద హరిజన శివ అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలు తక్షణ ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు శనివారం కౌన్సిలర్ వన్నూరుస్వామి మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్ అందజేశారు. ధైర్యంగా ఉండాలని ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. బీమా కింద మిగతా రూ.90 వేలు నామిని ఖాతాకు జమ అవుతుందన్నారు. కౌన్సిలర్లు డిష్ గోవిందు, షబ్బీర్, ఫకృద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొలిమి ఆనంద్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంత తవ్వుకుంటే రూ.6 వేలు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

కూడేరు: జగనన్న కాలనీల్లో ఇంటి ముందు ఇంకుడు గుంత తవ్వుకుంటే ఉపాధి హామీ పథకం కింద రూ.6 వేలు నగదు అందజేస్తామని హౌసింగ్ డీఈ హనుమప్ప తెలిపారు. శనివారం ఆయన కూడేరు, ముద్దలాపురంలోని జగనన్న కాలనీల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ బట్టలు ఉతికిన, వంట పాత్రలు కడిగిన వృథా నీరు ఇంటి ముందు పారబోయడం ద్వారా అపరిశుభ్రత నెలకొని దోమలు ప్రబలే అవకాశముందన్నారు. ఇంకుడు గుంత తవ్వుకుంటే వృథా నీరంతా అందులోకి చేరుతుందన్నారు. ఇంకుడు గుంతలు తవ్వుకోవడానికి లబ్ధిదారులు ముందుకు రావాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూడేరు, అరవకూరు, ముద్దలాపురం, పి.నాగిరెడ్డిపల్లి, కడదరకుంట, జల్లిపల్లిలోని జగనన్న కాలనీలకు 95 ఇంకుడు గుంతలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంకే బాషా, హౌసింగ్ ఏఈ శేఖర్ , వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేశారు..


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

వజ్రకరూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గుండ్లపల్లి ప్రసాద్‌రెడ్డి, సర్పంచు మోనాలినా అన్నారు. శనివారం మండల కేంద్రంలో నూతన ఫించన్‌దారులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఫిరోజ్‌భాను, ఎంపీడీఓ విజయలలిత, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్మాన్, ఆర్.బాబు, నల్లబోతుల కిరణ్, ప్రభుదాస్, వెంకటేష్, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓజోన్ పరిరక్షణ దినోత్సవం

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక ప్రభుత్వ ఎస్వీజీఎం డిగ్రీ కళాశాలలో శనివారం ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రసాయన శాస్త్ర అధ్యాపకుడు రాజశేఖరరెడ్డి ఓజోన్ దినోత్సవం ప్రాముఖ్యత, రసాయన పదార్థాల వాడకాన్ని తగ్గించాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందీ భాష అధ్యయనం ఉపయోగకరం

రాయదుర్గం రూరల్: హిందీ భాష అధ్యయనం విద్యార్థులకు ఉపయోగకరమని ప్రిన్సిపాల్ రఘురామమూర్తి అన్నారు. మండలంలోని 74 ఉడేగోళం వద్ద ఉన్న కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు హిందీ భాష నేర్చుకోవడానికి ఆసక్తి పెంచుకోవాలన్నారు. హిందీ భాష కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం హిందీ భాష పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కిరణ్, నారాయణ, మల్లికార్జున, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్


కళ్యాణదుర్గం: క్రీడాకారులకు రన్నింగ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం


డీహీరేహాళ్: పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు

కళ్యాణదుర్గం/రాయదుర్గం టౌన్: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సుధీర్ అన్నారు. కళ్యాణదుర్గం పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన క్రీడా పోటీలు రెండో రోజూ కొనసాగాయి. వివిధ పాఠశాలల నుంచి అండర్- 14, అండర్ -17 విభాగాల్లో దాదాపు 500 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా సుధీర్‌తో పాటు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎంవీ శేషయ్యలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం క్రీడాకారులకు అక్షయ పాత్ర ఫౌండేషన ద్వారా భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ చల్లా కిరణ్‌చౌదరి, వ్యాయామ ఉపాధ్యాయులు మురళి, సురేష్, ఇబ్రహీం, ఎర్రిస్వామి, రమేష్, ఫణిరాజ్, ఆనంద్, చంద్రకళ, పార్వతిలతో పాటు పలువురు పాల్గొన్నారు. అలాగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాయదుర్గం నియోజకవర్గ స్థాయి పోటీలు ముగిశాయి. శనివారం డి.హీరేహాళ్ మండలం సోమలాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన అండర్- 14, అండర్- 17 విభాగాల్లో బాలబాలికలు హాజరయ్యారు. హెచ్‌ఎం శ్రీదేవి అధ్యక్షతన సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, పీసీ కమిటీ చైర్మన్ సురేష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై క్రీడలను ప్రారంభించారు. పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్, త్రో విభాల్లో హోరాహోరీగా పోటీలు సాగాయి. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపిక చేసినట్లు నియోజకవర్గ కోఆర్డినేటర్ నాగేంద్ర, కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శివశరణప్ప, తిరుపతయ్య, అశోక్, బోగేష్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పండుగల కోలాహలం

రాయదుర్గం: వినాయక చవితి, మారెమ్మదేవి ఉత్సవాలు ఒకేసారి రావడంతో రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లోని పట్టణాలు, గ్రామాల్లో కోలాహలం మొదలైంది. సోమవారం వినాయకచవితి, మంగళవారం మారెమ్మ జాతరకు మండపాలు, ఆలయాలు ముస్తాబవుతున్నాయి. వినాయకులను కొలువుదీర్చేందుకు ప్రత్యేక మండపాలు సిద్ధంకాగా, మారెమ్మ దేవి ఆలయాలు విద్యుత్‌దీప కాంతులతో తళతళమంటున్నాయి. బంధువులతో పాటు ఇతర ప్రాంతాలకెళ్లిన వారు స్వగ్రామాలకు చేరుతున్నారు. గుమ్మఘట్ట మండలానికి కూతవేటు దూరం కర్ణాటక రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన గౌరసముద్రం అమ్మవారి ఉత్సవాలకు భక్తులు సిద్ధమయ్యారు. పట్టణంలోని కోటలో వెలసిన మారెమ్మ, దుగ్గిలమ్మ ఆలయాల వద్ద వేలాది మంది భక్తులు పాల్గొననున్నారు కాగా రాయదుర్గానికి కూతవేటు దూరం కర్ణాటక రాష్ట్రం రాంపురంలో శనివారం నిర్వహించిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత కిటకిటలాడింది. మంగళవారం మారెమ్మ పండుగ నిర్వహిస్తుండడంతో మూగ జీవాల కొనుగోలుకు జనం ఎగబడ్డారు.

కోడిపల్లిలో పశు వైద్య శిబిరం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని ఈస్ట్ కోడిపల్లిలో శనివారం పశువైద్య శిబిరం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్ గుప్త, జిల్లా పశు గణాభివృద్ధి అధికారి డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు. శిబిరంలో 185 పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకాలు వేశారు. 56 దీర్ఘకాలిక వ్యాధిగ్రస్త పశువులు, 38 గొడ్డు మోతు పశువుకు వైద్యం, చూలు పరీక్షలు చేసి వైద్యం చేశారు. 27 లేగదూడలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో వైద్యులు మంజునాథ్, విజయ కుమారి, గోపాలమిత్ర రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాప్తాడురూరల్: ఉరవకొండ మండలం మైలారంపల్లి గ్రామానికి చెందిన గంగప్ప (38) శనివారం అనంతపురం నగర శివారులోని ఎంవైఆర్ కల్యాణ మంటపం ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగప్ప, మరో వ్యక్తి రెండు బైకుల్లో మాట్లాడుకుంటూ ఉరవకొండ వైపు వెళ్తున్నారు. వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ప్రమాదంలో గంగప్ప అక్కడిక్కడే మృతి చెందగా.. మరో వ్యక్తి గాయాలతో బయటపడ్డాడు. ఘటనా స్థలానికి రూరల్ పోలీసులు చేరుకుని పరిశీలించారు. గంగప్ప మృతదేహాన్ని సర్వజన ఆస్పత్రికి తరలించారు. బంధువులకు సమాచారం చేరవేశారు. కాగా ప్రమాదంలో గాయపడ్డ మరో వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదు.

పేదలకు వరం 'జగనన్న ఆరోగ్య సురక్ష'


వజ్రకరూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి అనుపమ


బ్రహ్మసముద్రం: భైరసముద్రంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని ఎయిడ్స్ అండ్ లెప్రసీ అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనుపమ అన్నారు. మండలంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను శనివారం ఆమె తనిఖీ చేశారు. మొదట వజ్రకరూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ఏర్పాట్లను అడిగి తెలుసు కున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించనున్న వైద్య శిబిరం ఏర్పాట్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి తేజశ్వి, పీఎంఓ నాగన్న, హెచ్‌ఈఓలు సత్య నారాయణ, మహేష్, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, ఆరోగ్య విస్తరణాధికారి గురుప్రసాద్, సూపర్‌వైజర్లు నాగశంకర్, సుశీల, ఏఎన్‌ఎం సుకన్య తదితరులు పాల్గొ న్నారు.

ఇంటింటికీ ఉచిత ఆరోగ్య సేవలు

గుమ్మఘట్ట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ ఆరోగ్యసేవలు ఉచితంగా అందిస్తున్నట్లు గుమ్మఘట్ట పీహెచ్‌సీ వైద్యులు రమేష్, బాలాజీ నాయక్ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోనబావి గ్రామంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలను గుర్తించి యాప్‌లో నమోదు చేశారు. ఈ నెల 30న వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. సర్వేను పక్కాగా నిర్వహించాలని వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళీధర్, పీహెచ్‌ఎన్ నాగరత్నాలు, సూపర్‌వైజర్ ఆదిబయమ్మ, ఏఎన్‌ఎం చెన్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు అనూష, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని భైరసముద్రం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టారు. వలంటీర్లు, వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ సమస్యలను తెలుసుకుని యాప్ లో నమోదు చూస్తూ... అవసరమైన వారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంపీడీఓ దాసానాయక్ , మండల వైద్యాధికారి దాసానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్ వాడీలు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

వజ్రకరూరు: మండలంలోని గడేహోతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పీహెచ్‌సీ)శనివారం ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు పద్మ, మారుతి తదితరులతో సమావేశం నిర్వహించి డెంగీ, మలేరియాపై అడిగి తెలుసుకున్నారు. వ్యాధులు ప్రబలకుండా గ్రామీణులను చైతన్యపరచాలన్నారు. అనంతరం ల్యాబ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

రాయదుర్గంటౌన్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విభాగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ రెండు రోజుల పాటు చేపట్టిన స్కూటర్‌యాత్ర శనివారం రాయదుర్గం పట్టణానికి చేరుకుంది.